

ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 36.5
కనిష్ఠం 25.0
ANDHRAJYOTHY
నల్లగొండ
5
శుక్రవారం 14 జూన్ 2024



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుత	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	504.70 (122.8483)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.50 (2.58)	320	84.39
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	100.52 (0.806)	301	నిల్

చికెన్ ధరలు లైవ్: రూ.170 డ్రెస్: రూ.250 స్కిన్‌లెస్: రూ.280



ఆ ఫైల్ అక్కడే ఉంది

- గొర్రెల కొనుగోళ్ల బిల్లుల ఫైల్ తొమ్మిది నెలలుగా పశుసంవర్ధకశాఖ కార్యాలయంలోనే
- కలెక్టరేట్‌కు ఫైల్ పంపాలని గత బీఆర్ఎస్ సర్కారు హయాంలో ఒత్తిళ్లు
- భయంతో పంపని జిల్లా అధికారులు
- ఏసీబీ దృష్టితో వెనకడుగు
- దళారులకు నిలిచిన రూ.18కోట్ల బిల్లులు
- డిప్యుటేషన్ అధికారులపై విచారణ లేనట్లేనా?

నల్లగొండ, జూన్ 13: గొర్రెల కొనుగోలులో అక్రమాల్లో కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. గత ప్రభుత్వ హయాంలో దళారుల నుంచి కొనుగోలు చేసిన గొర్రెలకు సంబంధించి రూ.18కోట్ల బిల్లుల ఫైళ్లను కలెక్టరేట్‌కు పంపించాలని అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు మొదలు ప్రజాప్రతినిధుల నుంచి పెద్ద ఎత్తున ఒత్తిళ్లు వచ్చినట్లు సమాచారం. అయితే పశుసంవర్ధకశాఖలోని ఓ ఉన్నతాధికారి ఈ అక్రమాలకు సంబంధించిన ఫైల్‌ను ఎట్టి పరిస్థితుల్లో పంపేది లేదంటూ గత ప్రభుత్వ హయాంలో స్పష్టం చేసినట్లు వినికిడి. దీంతో ఆ అధికారిపై మరింత ఒత్తిడి పెరగడంతో సెలవుల్లో వెళ్లినట్లు సమాచారం. ఆ తరువాత బీఆర్ఎస్ ప్రభుత్వంలోని కీలకమైన ప్రజాప్రతినిధులు మళ్లీ చక్రం తిప్పి ఇతర సీనియర్ అధికారులకు జిల్లా పశుసంవర్ధశాఖ బాధ్యతలు అప్పగించారు. అయితే అప్పట్లో కలెక్టరేట్‌లోని జిల్లా ఉన్నతాధికారులు ఆ ఫైల్‌ను ఎట్టి పరిస్థితుల్లో కలెక్టరేట్‌కు పంపవద్దంటూ తేల్చి చెప్పడంతో గత ఏడాది సెప్టెంబరు నుంచి రూ.18కోట్ల బిల్లుల ఫైల్ జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయంలోనే మూలుగుతోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గొర్రెల స్కాం తెరపైకి వచ్చింది. ఆ తరువాత ఏసీబీ విచారణను ముమ్మరం చేయడంతో తీగ లాగితే నల్లగొండలో కూడా గొర్రెల స్కాం డొంక కదలింది.

ఓ అధికారి అరెస్ట్‌తో వెలుగులోకి

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గొర్రెల కొనుగోళ్లు, బిల్లుల చెల్లింపులో అవినీతి జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక్కో రైతు నుంచి 10నుంచి 12యూనిట్లు మాత్రమే కొనుగోలు చేయాలి. కానీ, నల్లగొండలో మాత్రం అందుకు విరుద్ధంగా దళారుల నుంచి పెద్ద మొత్తంలో యూనిట్లను కొనుగోలు చేసి అధికారులు చిక్కుల్లో పడ్డారు. నల్లగొండ జిల్లాకు మొత్తం 1,130యూనిట్ల గొర్రెలను దళారుల నుంచి కొనుగోలు చేశారు. కర్నాటక రాష్ట్రంలోని బీదర్, ఏపీ రాష్ట్రంలోని అనంతపురం, ప్రకాశం జిల్లాల నుంచి గొర్రెలను కొనుగోలు చేసి వాటిని రైతులకు ఇవ్వకుండానే తిరిగి విక్రయించడం, బినామీల పేరుతో కొనుగోలు చేయడం వంటి అక్రమాలకు అధికారులు పాల్పడ్డారు. ఒక్కో దళారీ నుంచి 150 నుంచి 200యూనిట్ల గొర్రెలు కొనుగోలు చేయడంతో ఉన్నతాధికారులకు అనుమానాలు వచ్చాయి. ఈ కేసులో కొద్ది రోజుల క్రితం ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసిన నలుగురు అధికారుల్లో నల్లగొండ వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ సంగు గణేష్ ఉన్నారు. అరెస్టయిన తరువాత ఆయన్ను బాధ్యతల నుంచి తప్పించడమేగాక ఆయన స్థానంలో యాదాద్రి జిల్లాకు చెందిన ఓ అధికారికి డీడీగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీనికి తోడు వయోజన విద్యలో కీలకమైన సెక్షన్ల పనులను నల్లగొండ డీఈవోకు కేటాయించారు. ఏసీబీ అధికారులు కొద్ది రోజుల క్రితం గొర్రెల అక్రమాల కేసులో అధికారులను కస్టడీకి తీసుకుని విచారించగా, గణేష్ పలు కీలకమైన అంశాలను వెల్లడించినట్లు అప్పట్లో చర్చసాగింది.

డిప్యుటేషన్ అధికారులు తప్పించుకున్నట్లేనా?

గత ప్రభుత్వం గొర్రెల కొనుగోళ్ల కోసం ఇతర రాష్ట్రాలకు పశుసంవర్ధకశాఖ అధికారులతో పాటు ఇతర శాఖలకు చెందిన అధికారులను పంపింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు నల్లగొండ జిల్లాలోని వివిధ కీలక శాఖలకు చెందిన ఉన్నతాధికారులు గొర్రెల కొనుగోళ్లలో ప్రధాన పాత్ర పోషించారు. అందులో పలువురు దళారుల వద్దనే గొర్రెలను సేకరించే విషయంలో ఉత్సాహం చూపినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నల్లగొండ జిల్లాలో 1130యూనిట్ల కొనుగోళ్లకు సంబంధించి రూ.18కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఆ సొమ్ము సాధారణ రైతులకు కాకుండా దళారులకే చెల్లించాల్సి రావడంతో వివాదాస్పదంగా మారింది. ఈ విషయాన్ని అప్పటి కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ పరిశీలించి ఫైల్‌ను పక్కన పెట్టారు. ప్రస్తుత కలెక్టర్ దాసరి హరిచందన సైతం ఫైల్‌ను పూర్తిస్థాయి పరిశీలించాల్సి ఉందని పశుసంవర్ధకశాఖ అధికారులకు స్పష్టం చేయడంతో పాటు అక్రమాలను ఆమె గ్రహించినట్లు విశ్వసనీయ సమాచారం. ఆ ఫైల్‌కు మోక్షం కలిగే ప్రసక్తి లేదని పశుసంవర్ధకశాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి. తొమ్మిది నెలలుగా ఈ ఫైల్ పశుసంవర్ధకశాఖలోనే మూలుగుతోంది. ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్‌పై వెళ్లిన అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించినట్టు తెలుస్తోంది. వారిని త్వరలోనే ఏసీబీ అధికారులు విచారించే చేసే అవకాశాలు ఉన్నట్టు జోరుగా చర్చ నడిచినా, ఇప్పటి వరకు వారికి నోటీసులు అందకపోవడంతో సదరు డిప్యుటేషన్ అధికారులు తప్పించుకున్నట్లేనా? అనే చర్చ సాగుతోంది. వారందరిని విచారిస్తే అక్రమాలు పూర్తి స్థాయిలో బయటపడే అవకాశం ఉంది.

1,172 నకిలీ ఇన్వాయిస్

నల్లగొండ జిల్లాలో 1,172 నకిలీ ఇన్వాయిస్ చెల్లింపులు చేసినట్లు కాగ్ నివేదికలో వెల్లడించింది. వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ గణేష్, పశుసంవర్ధకశాఖ రాష్ట్ర కార్యాలయంలోని ఉన్నతాధికారులను అరెస్ట్ చేసిన అనంతరం అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. గత ప్రభుత్వం హయాంలో పశుసంవర్ధకశాఖకు సంబంధించిన వారు కాకుండా ఇతర శాఖల్లో ఉత్సాహవంతులను డిప్యుటేషన్‌పై గొర్రెల కొనుగోళ్లకు నియమించారు. నల్లగొండ జిల్లాలో మూడు శాఖలకు సంబంధించిన అధికారులు పశుసంవర్ధక శాఖకు డిప్యుటేషన్‌పై వెళ్లి దళారుల నుంచి గొర్రెల యూనిట్లను కొనుగోలు చేసి అక్రమాల్లో భాగస్వాములైనట్టు వినికిడి. టూవీలర్‌తో పాటు ఆటో నెంబర్లను ఉపయోగించి డీసీఎంలలో, లారీల్లో గొర్రెలను తరలించినట్టుగా ఫైల్ రూపొందించారు. ఆటోల్లో, టూ వీలర్లలో వందలాది యూనిట్ల గొర్రెలను ఎలా తరలించారన్న విషయంపై అనుమానాలు రావడం ఈ స్కాంలో పాల్గొన్న అధికారులకు ఉచ్చు బిగించేలా చేసింది. రూ.18కోట్ల ఫైల్ ఒక సమస్య కాగా, నకిలీ ఇన్వాయిస్ చెల్లింపులు చేయడం మరో సమస్యగా మారింది.

> **బిల్లుల ఫైల్‌ను కలెక్టరేట్‌కు పంపలేదు**
>
> రైతుల నుంచి కాకుండా దళారుల నుంచి సేకరించిన గొర్రెల యూనిట్ల బిల్లులకు చెందిన ఫైల్‌ను కలెక్టరేట్‌కు పంపించలేదు. గత ఏడాది సెప్టెంబరు నుంచి ఆ ఫైల్ పశుసంవర్ధకశాఖ కార్యాలయంలోనే ఉంది. గొర్రెల కొనుగోళ్లలో అక్రమాలు జరిగినట్లు అనుమానాలు రావడంతో ఆ ఫైల్‌ను కార్యాలయంలోనే ఉంచాం. రూ.18కోట్ల బిలుల్లు చెల్లించే అవకాశాలు లేవు. నిబంధనలకు విరుద్ధంగా రైతుల నుంచి కాకుండా దళారుల నుంచి గొర్రెల యూనిట్లను కొనుగోలు చేసినట్లు నిర్ధారణ జరిగింది. వాస్తవానికి రైతుల నుంచి 10 నుంచి 12 యూనిట్ల వరకు మాత్రమే కొనుగోలు చేయాలి. కానీ 150 నుంచి 200యూనిట్ల వరకు దళారుల నుంచి సేకరించినట్టు తేలింది.
>
> డా.శ్రీనివాసరావు, పశుసంవర్ధకశాఖ నల్లగొండ జేడీ

ఉమ్మడి జిల్లాలో 274మందికి

జీహెచ్‌ఎంగా పదోన్నతి

- పాత స్థానం నుంచి 12న సాయంత్రం రిలీవ్, 13న ఉదయం కొత్త స్థానంలో బాధ్యతల స్వీకరణ
- జడ్పీ స్కూల్ అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియ ప్రారంభం
- ఆన్‌లైన్‌లో సీనియారిటీల జాబితాలు

యాదాద్రి, జూన్ 13(ఆంధ్రజ్యోతి)/ నల్లగొండ, సూర్యాపేటఅర్బన్: ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియలో భాగంగా మల్టీజోన్-2 పరిధిలోని జడ్పీ మేనేజ్‌మెంట్‌లో జీహెచ్‌ఎం(గెజిటెడ్ హెడ్‌మాస్టర్)లుగా స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతుల ప్రక్రియ గురువారం పూర్తయింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 274 మంది స్కూల్ అసిస్టెంట్లకు జీహెచ్‌ఎంలుగా పదోన్నతి లభించింది. ఇప్పటికే ప్రభుత్వ మేనేజ్‌మెంట్‌లో జీహెచ్‌ఎంలుగా స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు, స్కూల్ అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియ గత ఏడాది పూర్తయింది. ఆ తరువాత కోర్టు కేసుల కారణంగా జడ్పీ మేనేజ్‌మెంట్‌లో పదోన్నతులు, బదిలీల ప్రక్రియ నిలిచింది. ఇటీవల హైకోర్టు స్టే ఎత్తివేయడంతో తిరిగి బదిలీలు, పదోన్నతులు ప్రారంభమయ్యాయి. కాగా, పదోన్నతులు పొందిన జీహెచ్‌ఎంలు ఈ నెల 12న పాత పాఠశాలల నుంచి రిలీవ్ కావడంతోపాటు గురువారం ఉదయం కొత్త పాఠశాలల్లో విధుల్లో చేరారు.

- యాదాద్రి జిల్లాలో మొత్తం 75మంది స్కూల్ అసిస్టెంట్‌లకు జీహెచ్‌ఎంలుగా పదోన్నతి లభించింది. జిల్లాలో 83 జీహెచ్‌ఎం పోస్టులు ఖాళీ కాగా, జిల్లాకు చెందిన 53 మంది స్కూల్ అసిస్టెంట్లకు జీహెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించారు. ఇతర జిల్లాలో పనిచేస్తున్న 30 మంది జీహెచ్‌ఎంలుగా పదోన్నతి పొంది జిల్లాకు బదిలీ అయ్యారు. జిల్లాలో పనిచేస్తున్న 22 మంది స్కూల్ అసిస్టెంట్లు జీహెచ్‌ఎంలుగా పదోన్నతి పొంది ఇతర జిల్లాల్లోని ఖాళీల్లో పోస్టింగ్ పొందారు. కాగా, జిల్లాలో మొత్తం 3,465 ఉపాధ్యాయ పోస్టులకు ప్రస్తుతం 2,800మంది విధులు నిర్వహిస్తున్నారు.
- నల్లగొండ జిల్లాలో 129మంది స్కూల్ అసిస్టెంట్లకు జీహెచ్‌ఎంగా పదోన్నతి లభించింది. జిల్లాలో 109 జీహెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో అర్హులైన 87 మంది స్కూల్ అసిస్టెంట్లకు జీహెచ్‌ఎంగా పదోన్నతి కల్పించారు. ఇతర జిల్లాల నుంచి 22 మంది పదోన్నతిపై జిల్లాకు వచ్చారు. దీంతో జిల్లాలోని ఖాళీలు పూర్తయ్యాయి. జిల్లాకు చెందిన మరో 42మంది స్కూల్ అసిస్టెంట్లు జీహెచ్‌ఎంగా పదోన్నతి పొంది మల్టీజోన్-2 పరిధిలోని ఇతర జిల్లాల్లోని ఖాళీల్లో విధుల్లో చేరారు. మొత్తంగా జిల్లాకు చెందిన 129 మందికి జీహెచ్‌ఎంలుగా పదోన్నతులు లభించాయి.
- సూర్యాపేట జిల్లాలో జడ్పీ మేనేజ్‌మెంట్‌లో 70 మందికి స్కూల్ అసిస్టెంట్లకు జీహెచ్‌ఎంలుగా పదోన్నతి లభించింది. జిల్లాలో 102 జీహెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉండగా, జిల్లాకు చెందిన 68 మంది స్కూల్ అసిస్టెంట్లకు జీహెచ్‌ఎంగా పదోన్నతి కల్పించారు. ఇతర జిల్లాల నుంచి పదోన్నతిపై 34మంది జిల్లాలకు వచ్చారు. దీంతో జిల్లాలోని ఖాళీలు పూర్తయ్యాయి. ఇక జిల్లా నుంచి ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లు పదోన్నతిపై జీహెచ్‌ఎంలుగా మల్టీజోన్-2 పరిధిలోని ఇతర జిల్లాల్లోని ఖాళీల్లో విధుల్లో చేరారు.



పదోన్నతిపై నార్కట్‌పల్లి మండలం కురుమర్తి పాఠశాలలో బాధ్యతలు తీసుకుంటున్న జీహెచ్‌ఎం కవిత

స్కూల్ అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియ షురూ

స్కూల్ అసిస్టెంట్లకు జీహెచ్‌ఎంలుగా పదోన్నతి లభించడంతో స్కూల్ అసిస్టెంట్ పోస్టుల ఖాళీలు ఏర్పడ్డాయి. దీంతో స్కూల్ అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. బదిలీల అనంతరం ఏర్పడిన ఖాళీలను ఎస్జీటీలకు పదోన్నతి ద్వారా భర్తీ చేస్తారు. ఆ తరువాత ఎస్జీటీల బదిలీలు చేపడతారు. బదిలీల అనంతరం ఏర్పడిన ఖాళీలను డీఎస్సీ ద్వారా నింపుతారు. వారం రోజుల్లోగా స్కూల్ అసిస్టెంట్ల బదిలీ ప్రక్రియను పూర్తికానుంది. అందుకనుగుణంగా జిల్లా విద్యాశాఖ సీనియార్టీల జాబితాను రూపొందించి డైరెక్టరేట్‌కు నివేదించింది. డైరెక్టరేట్ అధికారులు సబ్జెక్టుల వారీగా సదరు సీనియార్టీల జాబితాను ఆన్‌లైన్ పొందుపరిచారు. జాబితాల్లో తప్పులు దొర్లితే వాటిని గ్రీవెన్స్ సెల్ లేదా డీఈవోల ద్వారా సరిచేసుకునే వెసులుబాటును ఉపాధ్యాయులకు కల్పించారు. తప్పులను సరిచేసిన అనంతరం తుది సీనియార్టీ జాబితాలను తిరిగి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆ తరువాత ఖాళీలను ప్రదర్శించి వెబ్ ఆప్షన్ నమోదుకు ఉపాధ్యాయులకు అవకాశం కల్పిస్తారు. ఉపాధ్యాయులు నమోదు చేసిన వెబ్ ఆప్షన్, సీనియార్టీ ప్రకారం వారికి ఆయా స్థానాలను కేటాయించి బదిలీ ఉత్తర్వులు జారీ చేస్తారు. ఆ తరువాత ఎస్జీటీ, లాంగ్వేజ్ పండిట్లు, పీఈటీలకు పదోన్నతులు, బదిలీలు చేపడతారు. ఇదిలా ఉండగా, లాంగ్వేజ్ పండిట్లు, పీఈటీల పోస్టులను స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంది. అయితే అర్హత ఉన్న తమకూ స్కూల్ అసిస్టెంట్(లాంగ్వేజ్ పండిట్), పీడీలుగా పదోన్నతి కల్పించాలని ఎస్జీలు కోరుతున్నారు. కాగా, ప్రభుత్వం మాత్రం కేవలం పండిట్లు, పీఈటీలకే సదరు పోస్టులను కేటాయించేందుకు సన్నద్ధమైంది. ఈ నేపథ్యంలో ఎస్జీటీలు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసు నేడు సుప్రీం కోర్టు బెంచిపైకి రానుంది. దీంతో కోర్టు స్టే ఇస్తుందా? లేదా? స్టే ఇస్తే పదోన్నతులు, అప్‌గ్రేడేషన్ ప్రక్రియ నిలిచిపోనుంది. దీంతో సుప్రీం కోర్టు వెలువరించే నిర్ణయంపై ఉపాధ్యాయులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

'ధరణి' దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి




కలెక్టర్ దాసరి హరిచందన

నల్లగొండ టౌన్, జూన్ 13: పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ దాసరి హరిచందన రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం తన చాంబర్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ధరణిలో టీఎం-33లోకి దరఖాస్తులు రాగానే వెంటనే నోటీసు జారీ చేయాలన్నారు. దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, జాప్యం చేయవద్దన్నారు. క్షేత్ర విచారణ తర్వాత పరిష్కరించదగినవాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్లు లాగిన్‌లో ఉన్న దరఖాస్తులను వేగంగా పరిష్కరించేలా ఆర్డీవోలు పర్యవేక్షించాలన్నారు. కోర్టు కేసులకు తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా క్షేత్రస్థాయిలో సర్వే సమస్యలు ఉంటే, వాటి జాబితా రూపొందించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన ఫిర్యాదులను 15 రోజుల్లోగా పరిష్కరించాలని, ఆన్‌లైన్‌లో వీటన్నింటిని పూర్తిచేయాలన్నారు. ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను రెండు రోజుల్లోగా పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే దినపత్రికల్లో వచ్చే వార్తలపై కూడా రెవెన్యూ అధికారులు తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఆర్డీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి

అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

నల్లగొండ టౌన్, జూన్ 13: ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన పనులను రెండు రోజుల్లోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర అధికారులను ఆదేశించారు. గురువారం మునిసిపాలిటీ పరిధిలోని అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిపై నల్లగొండ మునిసిపాలిటీలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ పథకం అమలుపై అలసత్వం వహించవద్దన్నారు. పనుల్లో జాప్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పనులను నిర్దేశించిన రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో నల్లగొండ మునిసిపల్ కమిషనర్ సయ్యద్ మునవ్ అహ్మద్, మెప్మా పీడీ కరుణాకర్, ఎంఈవో అరుంధతి, పాల్గొన్నారు.

భూనిర్వాసితులు అధైర్యపడవద్దు

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మర్రిగూడ, జూన్ 13: ముంపు గ్రామాల నిర్వాసితులు అధైర్యపడవద్దని, మూడు నెలల్లో పునరావాసం కల్పిస్తామని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హామీ ఇచ్చారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపట్టిన చర్లగూడ రిజర్వాయర్‌తో ముంపునకు గురవుతున్న నర్సిరెడ్డిగూడెం బాధితులు పునరావాసం కోసం రిజర్వాయర్ కట్టపై చేస్తున్న ధర్నాకు ఎమ్మెల్యే స్పందించారు. గురువారం నర్సిరెడ్డి గూడెం బాధితులను హైదరాబాద్‌లోని తన నివాసానికి పిలిపించి వారితో చర్చించారు. రిజర్వాయర్ పనులు అడ్డుకోకుండా సహకరించాలని వారిని కోరారు. ఇప్పటికే నిర్వాసితులకు తీవ్ర నష్టం జరిగిందని, మరోసారి నష్టం జరగకుండా ఎక్కడ కోరితే అక్కడ స్థలాన్ని సేకరించి, ప్రభుత్వం ఇవ్వకున్నా తన సొంత డబ్బుతో పునరావాసం కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మాదగోని సత్తయ్య, అయితగోని వెంకటయ్య, పెరుమళ్ల చంద్రయ్య, నీలకంఠ స్వామి దేవాలయ చైర్మన్ రాపోలు యాదగిరి, మాజీ జడ్పీటీసీ మేతరి యాదయ్య, చిట్యాల రంగారెడ్డి, తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

ముమ్మరంగా జాతర ఏర్పాట్లు

కనగల్, జూన్ 13: మండలంలోని దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు కొనసాగనున్నాయి. మూడు రోజుల పాటు కొనసాగనున్న జాతరకు సంబంధించి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయానికి రంగులు వేసి, విద్యుత్‌దీపాలతో అలంకరిస్తున్నారు. కల్యాణమండపం వద్ద చలువ పందిళ్లు ఏర్పాట్లు చేశారు. 15న (శనివారం) ఉదయం సుప్రభాతసేవ, లలిత సహస్రనామార్చన, బాలభోగ నివేదన, విఘ్నేశ్వరపూజ, స్వస్తి పుణ్యాహవాచనం, పంచగవ్య రక్షాబంధనం నిర్వహించనున్నారు. 16న పూర్ణాహుతి, నీరాజన మంత్రపుష్పాలు, ఉదయం 10.30 గంటలకు అమ్మవారి తిరుకల్యాణ మహోత్సవం, అన్నదానం నిర్వహించనున్నారు. 17న 108 కళశాలతో అష్టోత్తర శతఘటాభిషేకం, పూర్ణాహుతి, త్రిశూలస్నానం, సాయంత్రం బోనాలు సమర్పించనున్నారు. ప్రతీ రోజు రాత్రి బుర్రకథ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఏర్పాట్లను ఆలయ ఈవో జయరామయ్య, చైర్మన్ అల్లుబెల్లి నర్సింహారెడ్డి పర్యవేక్షిస్తున్నారు. అమ్మవారి కల్యాణ మహోత్సవానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు హాజరవుతారని తెలిపారు. బ్రహ్మోత్సవాలను భక్తులు విజయవంతం చేయాలని కోరారు.





బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయం, ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

78రోజుల్లో రూ.57.13లక్షల హుండీ ఆదాయం

చెర్వుగట్టులో హుండీ కానుకల లెక్కింపు

నార్కట్‌పల్లి, జూన్ 13: నార్కట్‌పల్లి మండలంలోని శైవక్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయ ఖజానాకు 78 రోజుల్లో రూ.57.13లక్షల హుండీ ఆదాయం సమకూరింది. మార్చి 26 నుంచి ఈ నెల 12వ తేదీ వరకు రామలింగేశ్వరుడిని దర్శించుకున్న భక్తులు సమర్పించిన మొక్కు కానుకలను గురువారం లెక్కించారు. గుట్టపైన ప్రధానాలయంతో పాటు ఉపాలయాల హుండీలను తెరిచి కానుకలు లెక్కించగా రూ.45,74,380లు, గుట్ట కింద పార్వతీ అమ్మవారి ఆలయంలో హుండీల కానుకలు రూ.11,38,720లు మొత్తం రూ.57,13,100లు లభించినట్లు దేవస్థాన ఈవో సిరికొండ నవీన్‌కుమార్ తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ సహాయ కమిషనర్ మహేంద్రకుమార్, పరిశీలకురాలు బీ.వెంకటలక్ష్మి, నందిగామ శ్రీ దుర్గ శివసాయి సేవాసమితి సభ్యులు దేవస్థాన, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఆశాలకు పరీక్ష ఆలోచనను విరమించుకోవాలి




నల్లగొండలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఆశా కార్యకర్తలు

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

నల్లగొండ టౌన్, జూన్ 13: ఆశాలకు పరీక్ష నిర్వహించే ఆలోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్ దాసరి హరిచందనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 30 ఏళ్లుగా గిరిజన ప్రాంతాల్లో, 19 ఏళ్లగా మైదాన ప్రాంతాల్లో ఆశా వర్కర్లు వైద్య ఆరోగ్యశాఖ అనుబంధంగా సేవలు అందిస్తున్నారని అన్నారు. కరోనా కాలంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు సేవలు అందించారని గుర్తుచేశారు. ప్రభుత్వాలు మాత్రం ఆశాల వేతనాలు పెంచకుండా, వారి సమస్యలు పరిష్కరించకుండా ఇబ్బందులకు గురి చేసేలా పరీక్ష నిర్వహించడం ఎందుకని ప్రశ్నించారు. పరీక్ష ద్వారా పదోన్నతి కల్పిస్తామని గానీ, రెగ్యులర్ చేస్తామనిగానీ చెప్పకుండా అసలు ఎందుకు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వానికే స్పష్టత లేకుండా జ్ఞాపకశక్తిని పరీక్షించేందుకు నిర్వహించే ఈ పరీక్షను ఎట్టి పరిస్థితుల్లో జరగనివ్వమని హెచ్చరించారు. ఆశాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, జాబ్ చార్ట్ రూపొందించాలని, పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని, అర్హత ఉన్న వారిని ఏఎన్ఎంలుగా పదోన్నతి ఇవ్వాలని, రూ.50లక్షల ప్రమాద బీమా చెల్లించాలని డిమాండ్ చేశారు. కుష్ఠు వ్యాధి నిర్ధారణ సర్వే, పల్స్ పోలియో, పలు ఎన్నికల్లో విధులు నిర్వహించిన భత్యం వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండంపెల్లి సత్తయ్య, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, డి.మహేశ్వరి, టి.వెంకటమ్మ, పెంజర్ల సైదులు, పోలె సత్యనారాయణ, భైరం దయానంద్, ఆర్.కవిత, బి.స్వర్ణ, వసంత, పార్వతమ్మ, బి.అనూష, ఎస్‌కె.సలీమా, పుష్పలత, విమల, ఎస్‌కె.తహర్, సిహెచ్.ధనలక్ష్మి, బి.రేణుక, పాల్గొన్నారు.

వైద్యులు అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో కల్యాణ్‌చక్రవర్తి

ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో కల్యాణ్‌చక్రవర్తి

దామరచర్ల, జూన్ 13: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలను చైతన్యపరిచి వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో కల్యాణ్‌చక్రవర్తి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. రోగులకు నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు పూర్తి స్థాయి సౌకర్యాలు ఉన్నాయన్నారు. ప్రస్తుత సీజన్‌లో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో కేస రవి, మండల వైద్యాధికారి నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్యులను అందుబాటులో ఉంచాలని గ్రామస్థులు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేశారు. గురువారం మండల కేంద్రంలోని ఎర్రనాంకాలనీలో పిచ్చికుక్కల దాడిలో ఎనిమిది మంది గాయపడి పీహెచ్‌సీ రాగా, వైద్యులు అందుబాటులో లేని విషయాన్ని ఈ సందర్భంగా ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన స్పందించి వైద్యులు అందుబాటులో ఉండేలా చూస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్‌కె.సుభాని, రాజేష్, రాంబాబు, మాలు, సత్యనారాయణ, మహేష్, అమర్, తదితరులు ఉన్నారు.

● గుట్టలో మోస్తరు వర్షం




యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో గురువారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. దీంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు, భక్తుల రాకపోకలకు అంతరాయం కలిగింది.



యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

● స్వామివారి నిత్య ఆదాయం రూ.23,89,661

భువనగిరి అర్బన్, జూన్ 13: యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య తిరుకల్యాణపర్వాలు పాంచరాత్రాగమ్మోరీతిలో వైభవంగా కొనసాగాయి. ప్రధానాలయ నైరుతి దిశలోని అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రాభరణాలు, వివిధ పుష్పమాలికలతో దివ్యమనోహరంగా అలంకరించారు. గజవాహన సేవలో తీర్చిదిద్ది వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం నిర్వహించారు. ఉత్సవమూర్తులను కల్యాణమండపంలో అధిష్ఠింపజేసి విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు అర్చకులు స్వామివారి శేషవస్త్రాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమ పూజలు చేశారు. ప్రభాతవేళ గర్భాలయంలోని స్వయంభువులను సుప్రభాతంతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో సంప్రదాయరీతిలో నిత్యపూజలు వైభవంగా నిర్వహించారు. అనుబంధ శివాలయంలో శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామికి నిత్యపూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం, శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.23,89,661 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.



ప్రధానాలయంలో లక్ష్మీనృసింహుడి తిరుకల్యాణపర్వాలు నిర్వహిస్తున్న అర్చకులు

అందరికీ..ఆపద్బాంధవ్

- 2,500 మందికి పైగా రక్తం అందించిన శశిగౌడ్
- ఆపద్బాంధవ్ ఫౌండేషన్ పేరిట సేవలు
- రోజులో ఒక్కరికైనా రక్తదానం
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం



బెస్ట్ సర్వీస్ అవార్డు అందుకుంటున్న పంజాల శశిగౌడ్(ఫైల్)

నార్కట్‌పల్లి, జూన్ 13 : రోడ్డు ప్రమాద క్షతగాత్రుల్లో చాలామంది సకాలంలో రక్తం అందక చనిపోతున్నారు. ఎప్పుడంటే అప్పుడు దొరికేది కాకపోవడం, మనుషులే ఉత్పత్తిదారులుగా ఉండటంతో రక్త సేకరణ అనేది అత్యవసర పరిస్థితుల్లో చాలా ప్రాధాన్య అంశం. గతంలో కన్నా రక్తదానంపై అవగాహన పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రముఖుల జన్మదినోత్సవాల సందర్భంగా, రెడ్‌క్రాస్, రోటరీ, లయన్స్, వాసవీ క్లబ్ లాంటి సంస్థలు రక్తదాన శిబిరాలను నిర్వహించి సేకరించిన రక్తాన్ని నిల్వచేస్తూ కావాల్సిన వారికి రక్తాన్ని అందిస్తున్నాయి. సంస్థలే కాదు వ్యక్తులు కూడా రక్తదానం చేస్తూ ఎందరికో ప్రాణదాతలుగా మారుతున్నారు. అలాంటి వారిలో నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లికి చెందిన రక్తదాత, పలు అవార్డుల గ్రహీత పంజాల శశిగౌడ్ ఒకరు. జూన్ 14న 'ప్రపంచ రక్తదాత'ల దినోత్సవం సందర్భంగా అతడి సేవా భావంపై కథనం.

మిత్రునికి ప్లేట్‌లెట్స్ తగ్గడంతో

నార్కట్‌పల్లి మండలం ఏపీలింగోటం గ్రామానికి చెందిన 32 ఏళ్ల పంజాల శశిగౌడ్ ఐదేళ్లుగా రక్తదానానికి సంబంధించిన సేవలందిస్తున్నాడు. ప్రస్తుతం నార్కట్‌పల్లిలో వస్త్ర దుకాణాన్ని శశిగౌడ్ నిర్వహిస్తున్నాడు. అనారోగ్యంతో ఉన్న తన మిత్రుడు రక్తం సకాలంలో అందక చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడిన ఆందోళనకర పరిస్థితి శశిగౌడ్ రక్తదానం చేయాలనే సంకల్పానికి పురికొల్పిందన్నారు. అలా దాదాపు 2018లో స్వయంగా తనే రక్తదానం చేస్తూ ఇలా మరి కొంతమందిని ఒప్పిస్తూ ఇప్పటి వరకు సుమారు 2,500 మందికి ఐదేళ్ల కాలంలో రక్తాన్ని అందించాడు.

ఆపద్బాంధవ్ ఫౌండేషన్ ఏర్పాటుతో..

రక్తదానంతో పాటు ఇతరత్రా సాయం చేయటానికి ఆపద్బాంధవ్ ఫౌండేషన్ పేరిట స్వచ్ఛంద సంస్థను స్థాపించాడు. తొలుత 10 మందితో మొదలైన సంస్థ నేడు 800 మంది సభ్యులకు చేరింది. వీరిలో కనీసం 200 మంది ప్రతీ మూడు నెలలకోసారి రక్తదానం చేస్తున్నారు. రోజులో ఒక్కరికైనా సంస్థ తరఫున రక్తదాన సేవలు కొనసాగుతూనే ఉన్నాయి. శశిగౌడ్ సేవలకు గుర్తింపుగా పలు సంస్థలు అవార్డుతో సత్కరించాయి. అంబేడ్కర్ ఉత్తమ సేవా రత్న, ఇండియన్ ఐకాన్, మహనీయుల పురస్కారం వంటివి ఇందులో ఉన్నాయి.

వరి నారు పెంపకం ప్రారంభం

చౌటుప్పల్ టౌన్, జూన్ 13 : వానాకాలం మొదలుకావడంతో సాగు పనులు ఊపందుకున్నాయి. ఈ నెల మొదటి వారంలో కురిసిన వర్షాలకు దుక్కులు దున్ని భూములను సాగుకు రైతులు సిద్ధం చేశారు. వరి సేద్యంలో భాగంగా యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో నారు పెంపకం ప్రారంభమైంది. వారం రోజులుగా నారు పెంపకంపై రైతులు దృష్టి సారించారు. రోహిణి కార్తె చివరలో వర్షాలు కువడంతో రైతులు మడుల్లో వరి విత్తనాలను చల్లుకున్నారు. రోహిణిలో వరి నారు వేసుకుంటే వంగడాలు బలంగా ఉండడంతో పాటు రోగ నిరోదక శక్తి ఎక్కువగా లభిస్తుందని రైతులు నమ్మకం. గత వానాకాలం సీజన్‌లో 8,729 మంది రైతులు 17,555 ఎకరాలు, ఈ యాసంగిలో 14,725 ఎకరాల్లో 7,727 మంది రైతులు వరి సాగు చేసినట్లు ఏవో నాగరాజు తెలిపారు. రెండేళ్లుగా వర్షాభావ పరిస్థితులతో చెరువుల్లో చుక్క నీరు లేకుండాపోవడంతో సాగునీటి సమస్య నెలకొంది. యాసంగి సీజన్‌లోనే వరి సాగును కొంతమేరకు రైతులు స్వచ్ఛందంగా తగ్గించుకున్నారు. అదే విధంగా వానాకాలం సీజన్‌లో కూడా మరికొంత వరి సాగు ను తగ్గించే అవకాశాలు ఉన్నాయి. అందుకను గుణంగా వరి నారు మడులు కూడా తగ్గిపోయాయి. పిలాయిపల్లి కాల్వ పరివాహక ప్రాంతంలోని గ్రామాల్లో వరి నారు మడులు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

శాస్త్రవేత్తల సూచనలను పాటించాలి

వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల మేరకు నారు మడి యాజమాన్య పద్ధతులను పాటించాలి. మొలకకట్టిన మేలు రకం విత్తనాలను చల్లుకోవాలి. వంగడాలు బలంగా ఉంటే గింజలు కూడా ధృడంగా వచ్చి అధిక దిగుబడులను సాధించేందుకు అవకాశాలు ఉంటాయి. ఏవో, ఏఈవోల సలహాలు, సూచనలను తీసుకుని సస్యరక్షణ చర్యలు చేపట్టి, మంచి దిగుబడులు పొందాలి.

– ముత్యాల నాగరాజు, ఏవో, చౌటుప్పల్



చౌటుప్పల్ మండలం ఎస్.లింగోటం గ్రామంలో నారు మడి

యాజమాన్య పద్ధతులు పాటిస్తే..

- వరి నారుమడి తయారీకి రెండు వారాల ముందు రెండు గుంటల మడికి 2 క్వింటాళ్ల బాగా మాగిన పశువుల ఎరువును వేసి రెండు, మూడు పర్యాయాలు కలియదున్నాలి.
- ఎకరం పొలం నాటుకోవడానికి రెండు గుంటల మడిలో అతి సన్న గింజ రకాలైతే 15 కిలోలు, సన్న గింజ రకాలైతే 20కిలోలు, దొడ్డు రకం గింజలైతే 25 కిలోల విత్తనం ఎత్తు మడిలో చల్లుకోవాలి.
- వరి విత్తనం దట్టంగా చల్లుకుంటే నారు పెరుగుదల బలహీనంగా ఉంటుంది.
- రెండు గుంటల(200చ.మీ.) నారుమడికి 2 కిలోల నత్రజని(కిలో విత్తనం చల్లే ముందు, మరో కిలో విత్తనాన్ని విత్తిన 12-14 రోజులకు), కిలో భాస్వరం, కిలో పొటాష్ ఎరువులను వేసుకోవాలి.
- మొలకకట్టిన విత్తనాన్ని చల్లి, వారం రోజులు ఆరు తడులు ఇచ్చి, ఆ తరువాత మొక్క దశలో పలుచగా నీరు ఉంచాలి.
- జింక్ లోప నివారణకు లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి.
- నారుమడిలో ఊద, ఒడిపిలి వంటి గడ్డి జాతి కలుపు నివారణకు వరి విత్తనాలను విత్తిన 15-20 రోజులకు సైహలోఫాప్-పి-బ్యూటైల్ 1.5 మిల్లీలీటర్ లేదా అన్ని రకాల కలుపు ఉన్నప్పుడు బిస్‌పైరీ బ్యాక్ సోడియం 0.5 మిల్లీలీటరును ఒక లీటరు నీటికి చొప్పున కలిపి విత్తిన 10-12 రోజులకు పిచికారీ చేసుకోవాలి.
- నారు పీకడానికి వారం రోజుల ముందు ఎకరాకు సరిపోయే నారుమడికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ గుళికలు చల్లుకోవాలి.
- పందులు, కోతుల నుంచి రక్షణ పొందేందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలి.
- నాటు వేసే సమయంలో వరి నారును దూరం నుంచి విసరకూడదు.

నల్లగొండ రైల్వేస్టేషన్‌లో రూ.1.28కోట్ల నగదు పట్టివేత

- మిర్యాలగూడకు చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ట్రెజరీ కార్యాలయంలో నగదు అప్పగించనున్న ఆర్‌పీఎఫ్ అధికారులు



స్వాధీనం చేసుకున్న నగదుతో రైల్వే పోలీసులు

నల్లగొండ క్రైం, జూన్ 13: ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.1.28 కోట్ల నగదును నల్లగొండ జిల్లా రైల్వేపోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. మిర్యాలగూడకు చెందిన బంగారం వ్యాపారి హైదరాబాద్‌లో బంగారం కొనుగోలు చేసేందుకు మిర్యాలగూడ నుంచి హైదరాబాద్‌కు రెండు బ్యాగుల్లో నగదును తీసుకెళ్తున్న క్రమంలో నల్లగొండ రైల్వేస్టేషన్‌లో ఆర్‌పీఎఫ్, రైల్వే పోలీసులు నగదును స్వాధీనం చేసుకున్నారు. మిర్యాలగూడకు చెందిన బంగారం వ్యాపారి తన వర్కర్‌తో కలిసి గురువారం ఫలక్‌నుమా రైల్‌లో నగదుతో హైదరాబాద్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో వారు అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు వారి బ్యాగులను తనిఖీ చేయగా అందులో రూ.1,28,41,800 కోట్ల వరకు నగదు ఉన్నట్లు గుర్తించారు. ఐటీ అధికారుల సహాయంతో నగదును నల్లగొండ రైల్వేస్టేషన్‌లో లెక్కించారు. ఈ నగదును ట్రెజరీ కార్యాలయానికి తరలించి అధికారులకు అప్పగించనున్నట్లు ఆర్‌పీఎఫ్ అధికారులు తెలిపారు. ఈ నగదు విషయానికి సంబంధించి తదుపరి కార్యాచరణ ఉండడంతో వివరాలు వెల్లడించేందుకు ఆలస్యం అవుతుందని ఆర్‌పీఎఫ్ పోలీసులు తెలిపారు. అయితే మిర్యాలగూడలో బంగారం దుకాణాల మధ్య ఉన్న పోటీతత్వంతో ఇతర వ్యాపారులు ఇచ్చిన సమాచారం మేరకు నగదును ఆర్‌పీఎఫ్ పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. మిర్యాలగూడకు చెందిన వ్యాపారి మహేందర్, పరమేష్‌కు చెందిన నగదుగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ నగదుకు సంబంధించిన పూర్తి వివరాలు శుక్రవారం తెలిపే అవకాశం ఉంది.

ప్రాణం తీసిన చేపల వేట

చెరువులో మునిగి వ్యక్తి మృతి



అంజద్‌ఖాన్(ఫైల్)

నల్లగొండ క్రైం, జూన్ 13: చేపల వేట ఒకరి ప్రాణం తీసింది. బుధవారం సాయంత్రం నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఉదయసముద్రం రిజర్వాయర్ వద్ద బుధవారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. నల్లగొండ రూరల్ ఎస్ఐ శివకుమార్, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... నల్లగొండ పట్టణంలోని మాన్యంచెల్కకు చెందిన మహ్మద్ అంజద్‌ఖాన్(33) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఖాళీ సమయంలో చేపల వేటకు వెళ్లేవాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం తన స్నేహితుడు పట్టణానికే చెందిన వహీద్‌తో కలిసి చందనపల్లి వైపు ఉన్న ఉదయసముద్రం రిజర్వాయర్ ఒడ్డున గాలంతో చేపల వేటకు వెళ్లాడు. ఈ క్రమంలో చెరువు ఒడ్డున పూడిక తీయడంతో ఒక్కొక్క చోట గోతులు తీశారు. అవి గమనించక అంజద్‌ఖాన్ అందులోకి దిగడంతో నీటిలో మునిగిపోయాడు. ఈత రాకపోవడంతో గమనించిన అతని స్నేహితుడు వహీద్ కాపాడేందేందుకు నీటిలోకి దిగాడు. అంజద్‌ఖాన్ వహీద్‌ను గట్టిగా పట్టుకోవడంతో భయాందోళనకు గురైన వహీద్ అంజద్‌ఖాన్‌ను వదిలివేసి గట్టు ఎక్కి ప్రాణాలు కాపాడుకున్నాడు. వహీద్ వెంటనే అంజద్‌ఖాన్ కుటుంబ సభ్యులతో పాటు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు వచ్చి సంఘటనా స్థలానికి చేరుకొని వెతికినా అంజద్‌ఖాన్ ఆచూకీ లభించలేదు. గురువారం మధ్యాహ్నం అంజద్‌ఖాన్ మృతదేహం నీటిలో తేలియాడటంతో సిబ్బంది మృతదేహాన్ని ఒడ్డుకు తెచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అంజద్‌ఖాన్ భార్య నజీయా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుండెపోటుతో యువకుడి మృతి



మహేష్ మృతదేహం

జనగామ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జనగామ కలెక్టరేట్‌లో గుండెపోటుతో గురువారం హౌస్‌కీపింగ్ సూపర్‌వైజర్ మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం ఫతేపూర్‌కు చెందిన ఐలబోయిన మహేష్(30) జనగామ కలెక్టరేట్‌లో రెండేళ్లుగా హౌస్ కీపింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. జనగామలోనే అద్దె ఇంట్లో తల్లితో కలిసి ఉంటూ విధులకు హాజరవుతున్నాడు. గురువారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు సిద్ధమవుతుండగా గుండెపోటు రావడంతో ఇంట్లోని మంచంపై కుప్పకూలిపోయాడు. గమనించిన తల్లి మహేష్‌ను స్థానికుల సాయంతో స్థానికఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

మునగాల, జూన్ 13 : సూర్యాపేట జిల్లా మునగాల మండలం బరాఖత్‌గూడెం శివారులో బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట పట్టణం జమ్మిగడ్డకు చెందిన అడిదెల సతీష్, అతడి సోదరి వినీషలు బైక్‌పై కోదాడలో నగలు కొనేందుకు వెళ్తున్నారు. బరాఖత్‌గూడెం శివారులో వెనక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో సూర్యాపేట ఏరియా అస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. సతీష్ బాబాయి వెంకట్‌రెడ్డి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళను బావిలోకి తోసి చంపిన వ్యక్తి అరెస్టు

మోత్కూరు, జూన్ 13: యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రంలోని ముత్యాలమ్మ బావిలోకి మాటూరి కవితను తోసి చంపిన భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన మాకోళ్ల నర్సింహులును గురువారం రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు అరెస్టు చేసి, రిమాండ్ చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కవిత నిందితుడి వ్యవసాయ పొలం వద్ద కూలి పనులు చేయడానికి వచ్చేదని, ఆ సందర్భంగా ఆమెతో అతడికి వివాహేతర సంబంధం ఏర్పడిందన్నారు. బుధవారం సాయంత్రం వారిద్దరు ముత్యాలమ్మ బావిలో ఈత కొట్టడానికి వెళ్లిన సందర్భంగా ఈత రాని కవితను నర్సింహులు నీటిలోకి నెట్టి పరారయ్యాడని తెలిపారు. గురువారం అతడిని అరెస్టు చేసి రిమాండ్ చేశామన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో విధ్వంసం

బొమ్మలరామారం, జూన్ 13 : షార్ట్‌సర్క్యూట్‌తో యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం తిమ్మాపురంలో నిత్యావసరాలు ధ్వంసమయ్యాయి. వివరాల్లోకి వెళితే తిమ్మాపూర్ గ్రామంలో అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న పెండం సాధన గురువారం ఉదయం ఆరు గంటల సమయంలో పనులు చేసుకుంటున్న సమయంలో హఠాత్తుగా ఇంట్లో షార్ట్‌సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. మంటల్లో ఫ్రిడ్జ్‌లోని నిత్యావసరాలు కాలిపోయి ధ్వంసమయ్యాయి. తనను ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె కోరింది.

బస్సులో నగదు సంచి మరిచిన యాచకుడు

ఫిర్యాదుతో డ్రైవర్‌ను అప్రమత్తం చేసిన పోలీసులు

హుజూర్‌నగర్, జూన్ 13: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో యాచకుడు పోగొట్టుకున్న డబ్బులను తిరిగి బాధితుడికి పోలీసులు అందించారు. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హుజూర్‌నగర్ పట్టణం ఫణిగిరిగట్టు వద్ద నివాసముంటున్న ఆవుల శంభయ్య, భార్య లక్ష్మి దంపతులు యాచన చేస్తుంటారు. భద్రాచలం, మేడారం, కొరివి ప్రాంతాల్లో యాచించి సొంత ఊరు హుజూర్‌నగర్‌కు బుధవారం రాత్రి కోదాడ నుంచి ఆర్టీసీ బస్సులో వస్తున్నారు. రాత్రి 11 గంటల సమయంలో హుజూర్‌నగర్‌లో దిగారు. దిగే హడావిడిలో రూ.34 వేల నగదు ఉన్న సంచిని బస్సులో మరిచిపోయారు. వెంటనే తేరుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో ఏఎస్ఐ కీత రమేష్, మిర్యాలగూడకు చెందిన ఆర్టీసీ డిపోకు ఫోన్ చేసి డ్యూటీ డ్రైవర్ నెంబరు తీసుకుని అతడికి ఫోన్ చేసి విషయం చెప్పారు. దీంతో డ్రైవర్ బస్సులోనే ఉన్న నగదు సంచిని జాగ్రత్త పరిచాడు. నగదును శంభయ్య,లక్ష్మి దంపతలకు సీఐ చరమందరాజు, ఎస్ఐ ముత్తయ్య సమక్షంలో గురువారం ఉదయం డ్రైవర్ అందజేశారు. కాగా రాత్రి నగదు పోగొట్టుకున్న సమయంలో వెంటనే స్పందించి రికవరీ చేసిన ఏఎస్ఐ కీతా రమేష్, కానిస్టేబుల్ సత్యనారాయణలను సీఐ అభినందించారు.

సమాచారం

నిత్యపూజా కైంకర్యాలు

ఉదయం 3.30 గంటలకు ఆలయాన్ని తెరుస్తారు

సుప్రభాతసేవ: ఉదయం 3.30నుంచి4వరకు
ఆరాధన: 4-4.30 వరకు, **బాలభోగం:** 4.30-5.15వరకు
నిజాభిషేకం: 5.15 నుంచి 6.15 గంటల వరకు
సహస్రనామార్చనలు: 6.15నుంచి 7గంటల వరకు
రాజభోగం: 11.45నుంచి 12.30వరకు, మధ్యాహ్నం 3-4 వరకు ఆలయం మూసివేస్తారు.
తిరువారాధన: సాయంత్రం 7నుంచి7.45గంటల వరకు
సహస్రనామార్చన: రాత్రి 7.30నుంచి 8.15గంటల వరకు
ఆరగింపు: రాత్రి 9 గంటల నుంచి
శయనోత్సవ దర్శనం: 9.30- 9.45 ద్వార బంధనం
ఉచిత దర్శనం: ఉదయం 5 నుంచి 8 గంటల వరకు తిరిగి సాయంత్రం 5-7 రాత్రి 8.15-9 గంటల వరకు
వీఐపీ వేళలు: ఉదయం 9-10, సాయంత్రం 4-5వరకు..

భువనగిరి అర్బన్

టీఎమ్మార్పీఎస్ నూతన కమిటీ

సూర్యాపేట టౌన్, జూన్ 13 : తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర, సూర్యాపేట జిల్లా కమిటీలను గురువారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్యమాదిగ ప్రకటించారు. జిల్లా ఇన్‌చార్జిగా, రాష్ట్ర కార్యదర్శి పడిదల రవికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మరికంటి అంబేడ్కర్‌మాదిగను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకు రాజకీయంగా సముచితస్థానం కల్పించాలన్నారు. మాదిగల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తమ నియా మకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

పెద్దరామచంద్రయ్యకు జాతీయ అవార్డు

దేవరకొండ, జూన్ 13 : నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం కురంపల్లి గ్రామానికి చెందిన వివేకానంద యూత్ క్లబ్ అధ్యక్షుడు, సామాజిక కార్యకర్త వరాల పెద్ద రామచంద్రయ్యయాదవ్‌కు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అవార్డు లభించింది. ఈ నెల 11న మహారాష్ట్రలోని పూణెలో నిర్వహించిన వెస్ట్రన్ ఇండియన్ కాన్ఫరెన్స్‌లో అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ ఈ అవార్డును అందజేశారు. ఆపదలో ఉన్నవారిని, రోడ్డు ప్రమాద క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి తన వంతుగా సహాయ, సహకారాలు అందించడంలో రామచంద్రయ్యయాదవ్ ముందుంటారు. ఆయన సేవలను గుర్తించి జాతీయ అవార్డును అకాడమీ అందజేసింది.

మిర్యాల శ్వేతకు ఓయూ డాక్టరేట్

నార్కట్‌పల్లి, జూన్ 13 : నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఎలికట్టె గ్రామానికి చెందిన మిర్యాల శ్వేతకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ప్రొఫెసర్ పీ.వెంకటయ్య పర్యవేక్షణలో 'బిజినెస్ మేనేజ్‌మెంట్'పై పరిశోధనకు యూనివర్సిటీ డాక్టరేట్‌ను అందజేయనుంది. త్వరలో ఆమె పట్టాను అందుకోనున్నారు. తాను పీహెచ్‌డీ పూర్తిచేయడానికి సహకరించిన భర్త గంజి సంతోష్‌కుమార్, ఆచార్యులు వెంకటయ్య, తల్లిదండ్రులకు ఆమె కృతజ్ఞతలు తెలిపింది.

విజేత కళాశాలలో జాబ్‌మేళా రేపు

మిర్యాలగూడ టౌన్, జూన్ 13: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని విజేత డిగ్రీ కళాశాలలో ఈ నెల 15న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెడ్ల ధనుంజయ్ తెలిపారు. ఎంఎస్ఎన్ లెబోరేటరీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాకు ఇంటర్, డిగ్రీ కోర్సుల్లో సైన్స్ సబ్జెక్టు పూర్తి చేసిన అభ్యర్థులు హాజరుకావాలని కోరారు. 26 ఏళ్లలోపు వయసు గల వారు విద్యార్హత, గుర్తింపు కార్డుతో హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 7993319545 నెంబరులో సంప్రదించాలన్నారు.

సూర్యాపేటలో విద్యుత్ ఉద్యోగులకు క్రీడాపోటీలు

భానుపురి, జూన్ 13 : ట్రాన్స్‌కో, డిస్కంల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు సూర్యాపేట ఎస్ఈ పాల్‌రాజ్ అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నల్లగొండ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగుల అంతర్ జిల్లా క్యాలెండర్-24కు సంబంధించి కబడ్డీ, చెస్ పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 11 జిల్లాల నుంచి 11 కబడ్డీ జట్లు, 16 జిల్లాల నుంచి 16 మంది చెస్ క్రీడాకారులు హాజరయ్యారని తెలిపారు. వివిధ జిల్లాల నుంచి సుమారు 200 మంది సూర్యాపేటకు వచ్చారన్నారు. రెండు రోజుల పాటు క్రీడలను ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహిస్తామన్నారు. మొదటి రోజు నల్లగొండ, ఖమ్మం జిల్లా కబడ్డీ జట్ల మధ్య జరిగిన పోరులో నల్లగొండ గెలిచింది. క్రీడా పోటీలను తిలకించడానికి క్రీడాభిమానులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అధికారి జగన్, కార్యదర్శి శ్రీనివాస్, డీఈలు శ్రీనివాస్, వెంకటకృష్ణయ్య, ఏఈ సురేష్ తదితరులు ఉన్నారు.

75 ట్రాక్టర్ల ఇసుక సీజ్

మేళ్లచెర్వు, జూన్ 13: సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం చింతిర్యాల పంచాయతీ పరిధిలో కృష్ణా నది నుంచి నిబంధనలకు విరుద్ధంగా తరలించి నిల్వ చేసిన 75 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దార్ సురేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానికుల సమాచారంతో ఆర్ఐ సైదా, పంచాయతీ సిబ్బంది చంద్రారెడ్డి సమక్షంలో పంచనామా నిర్వహించి సీజ్ చేశామన్నారు.

సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఏపీ అభివృద్ధి

● టీడీపీ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి

నల్లగొండ, జూన్ 13: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని టీడీపీ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు కసిరెడ్డి శేఖర్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో సైతం టీడీపీకి పూర్వవైభవం రానుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఐదు సంవత్సరాల పాటు విధ్వంస పాలన సాగించిన జగన్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. తెలంగాణలో పార్టీ బలోపేతం కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేసి రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గంలో కృషి చేస్తామన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు చేరేలా తమ పార్టీ పనిచేస్తుందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తే ప్రభుత్వంపై పోరాటాలు చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంతో పాటు రుణమాఫీని పూర్తిగా అమలు చేయాలని రైతులందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. వానాకాలం సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఆరు గ్యారంటీలతో పాటు ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మెనిఫెస్టో ప్రకారం పథకాలను అమలు చేయాలన్నారు.

గీతామందిర్‌లో ఆధ్యాత్మిక సందడి


హోమ పూజ చేస్తున్న వేదపండితులు

మిర్యాలగూడ టౌన్, జూన్ 13: పట్టణంలోని రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణ దేవస్థానం(గీతామందిరం)లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. గోవింద క్షేత్రంగా పిలిచే ఈ ఆలయంలో ద్వితీయ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బండారు కుశలయ్య తెలిపారు. విఘ్నేశ్వర పూజ, హోమంతో గురువారం ప్రారంభమైన ఉత్సవాలు ఈ నెల 17వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. శుక్రవారం నిర్వహించనున్న తీర్థ గోష్టి, ఎదుర్కోలు ఉత్సవాలకు త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి హాజరు కానున్నట్లు తెలిపారు. 15వ తేదీన స్వామివారి కల్యాణం, తిరువీధి ఉత్సవం అనంతరం అన్నదానం, 16న సుదర్శన నారసింహ ఇష్టి నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సత్యవేణి, చీదళ్ల శ్రీనివాస్, ప్రసాద్ ఉన్నారు.

'స్థలం ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి'

నార్కట్‌పల్లి, జూన్ 13: మండలంలోని అమ్మనబోలు గ్రామపంచాయతీ పరిధిలోని పెరుమాండ్లబావిలో ప్రభుత్వ పాఠశాల కోసం కేటాయించిన స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు గురువారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. 1988 సంవత్సరంలో ప్రభుత్వం బలహీనవర్గాల గృహ కాలనీ కోసం ప్రభుత్వ భూమిలో ప్లాట్లు చేసిందని, అందులోనే పాఠశాల కోసం ఆరు ప్లాట్లు కేటాయించిందని పేర్కొన్నారు. ఇందులో పాఠశాల భవనంతో పాటు మం చినీటి ట్యాంకు నిర్మించారని, మిగతా ఖాళీ స్థలాన్ని గ్రంథాలయ భవనం కోసం వినియోగించాలని భావించామని గ్రామస్థులు పేర్కొన్నారు. స్థలంలో రెండు ప్లాట్ల మేర స్థలాన్ని గ్రామానికి కొందరు ఆక్రమించి కడీలు పాతుతున్నారని అడ్డుకోబోయిన తమపై దాడులకు దిగుతున్నారని ఆరోపించారు.

మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేయాలి


మాట్లాడుతున్న గౌతంరెడ్డి

మిర్యాలగూడ, జూన్ 13: గ్రామపంచాయతీల్లో ప్రవేశపెట్టిన మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లు గౌతంరెడ్డి డిమాండ్ చేశారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గురువారం జరిగిన గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ సమావేశంలో మాట్లాడారు. గ్రామపంచాయతీ కార్మికులతో ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయించుకుంటుందని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ప్రతి నెల జీతం ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. రూ.20 లక్షల ఉచిత ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మంద అమాక్, ఉపాధ్యక్షులుగా వరికొప్పుల సైదమ్మ, శోబన్‌బాబు, కార్యదర్శిగా గంధం సైదులు, సహాయ కార్యదర్శిగా గంజి బిక్షం, కోశాధికారిగా టి.శ్రీనివాసరెడ్డి ఎన్నికయ్యారు. సమావేశంలో పంచాయితీ కార్మికులు రూప్లా, బుచ్చయ్య, నాగయ్య, సైదులు, మహేశ్, కిసన్, సైదా, దావీద్, నాగరాజు పాల్గొన్నారు.

'దివ్యాంగులను ఆదుకోవాలి'

నకిరేకల్, జూన్ 13: తెలంగాణ రాష్ట్రంలో ఉన్న దివ్యాంగులను ఆదుకోవాలని తెలంగాణ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోలి ప్రభాకర్ కోరారు. ఢిల్లీలో బొగ్గుగనుల శాఖ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో 10లక్షలకు పైగా అన్ని రకాల దివ్యాంగులు ఉన్నారని తెలిపారు. కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిపారు.

బీమాతో కార్యకర్తల కుటుంబాలకు భరోసా


నకిరేకల్‌లో చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్, జూన్ 13: బీఆర్ఎస్ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తల కుటుంబాలకు ఇస్తున్న బీమా సౌకర్యం సద్వినియోగం చేసుకోవాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్‌లోని 1వ వార్డుకు చెందిన బొడ్డు సైదులు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందాడు. బీఆర్ఎస్ నుంచి మంజూరైన రూ.2లక్షల బీమా చెక్కును గురువారం కుటుంబసభ్యులకు అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతిచెందితే వారి కుటుంబాలను ఆదుకోవాలనే లక్ష్యంతోనే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బీమా సౌకర్యం కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, ప్రగడపు నవీన్‌రావు, పల్లె విజయ్, రాచకొండ సునిల్, ప్రభాకర్‌రావు, గుర్రం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

మిర్యాలగూడ రూరల్, జూన్ 13: యువత క్రీడల్లో ప్రతిభ కనబరిచి రాణించాలని బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథ్‌నాయక్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ధనావత్ తిరుపతినాయక్ అన్నారు. మండలంలోని జంకుతండాలో భగత్‌సింగ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన జట్లకు గురువారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవీందర్, నాయకులు మక్లనాయక్, బిచ్యనాయక్, చినపాండు, మహేందర్, భగవాన్, మంగ్యనాయక్, మోతిలాల్, దివాకర్, నరేందర్, మహేందర్, రఘుపతి పాల్గొన్నారు.


క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న దశరథనాయక్, తిరుపతినాయక్

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం


నార్కట్‌పల్లిలో యూనిఫాంలు అందజేస్తున్న ఎమ్మెల్యే వీరేశం


రాజవరంలో పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి


మునుగోడు: దుబ్బకాలువలో యూనిఫాంలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

నార్కట్‌పల్లి, జూన్ 13: ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. బడిబాటలో భాగంగా నార్కట్‌పల్లిలోని జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు గురువారం స్కూల్ యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే అర్హత, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారన్న విషయాన్ని ప్రజలకు నచ్చజెప్పి పిల్లలను ప్రభుత్వ బడిబాట పట్టించే బాధ్యతను ఉపాధ్యాయులతోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు కూడా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పాశం శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో కూకుట్ల నర్సిహ, హెచ్ఎం రాములు, కాంగ్రెస్ నాయకులు బత్తుల ఊశయ్య, బండ సాగర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, పుల్లెంల అచ్చాలు, జెరిపోతుల భరత్, సట్టు సత్తయ్య, వేముల సత్యం, బింగి మహేశ్, సమద్ పాల్గొన్నారు.

కట్టంగూరు: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. కట్టంగూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన బడిబాట కార్యక్రమంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు. అనంతరం అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కట్టంగూరు, నకిరేకల్ ఎంపీపీలు జెల్లా ముత్తిలింగం, శ్రీదేవి, యాదగిరి, ఎంఈవో నాగయ్య, హెచ్ఎం అంబటి అంజయ్య, ఉపాధ్యాయులు అబ్బగోని రాజేందర్, బాలరాజు, గఫూర్, చంద్రయ్య పాల్గొన్నారు.

చిట్యాల: చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన బడిబాట కార్యక్రమంలో ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంఈవో కూకుట్ల నర్సింహ్మ, ప్రధానోపాధ్యాయులు కరుణాకర్‌రెడ్డి, బాదం బిక్షపతి, కౌన్సిలర్లు రెమిడాల లింగస్వామి, సత్తయ్య, కోనేటి కృష్ణ, జిట్ట పద్మ, జమాండ్ల జయమ్మ ఉన్నారు.

మునుగోడు రూరల్: నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని దుబ్బకాలువ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యూసుఫ్ పాషా పేర్కొన్నారు. మండలంలోని దుబ్బకాలువ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రాధిక, ప్రధానోపాధ్యాయులు యూసుఫ్ పాషా, ఉపాధ్యాయురాలు సునిత, మాజీ ఉపసర్పంచ్ వెంకన్న, సాదు భిక్షమయ్య, మల్లేష్ శివకుమార్, అనిత, పార్వతమ్మ, మాధవి పాల్గొన్నారు.

తిరుమలగిరి(సాగర్): పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి తల్లిదండ్రులకు సూచించారు. మండలంలోని రాజవరం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గురువారం నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేశారు. క్వాలిఫైడ్ ఉపాధ్యాయులతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మధ్యాహ్న భోజనంతోపాటు ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, ఎంఈవో తరి రాము, గడ్డం సాగర్‌రెడ్డి, నెమలి శ్రీధర్‌రెడ్డి, మండల నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్, హెచ్ఎం శ్రీను, ఉపాధ్యాయులు నోవా తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి: విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకురావాలని రిటైర్డ్ ఉపాధ్యాయిని పసుపులేటి లీల కోరారు. కేతేపల్లిలో జడ్పీహెచ్ఎస్, అమ్మ ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి నిర్వహించిన బడిబాట ర్యాలీలో పాల్గొని జడ్పీ పాఠశాలకు ప్రింటర్‌ను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో మేక నాగయ్య, జడ్పీ పాఠశాల హెచ్ఎం వై.నర్సిరెడ్డి, ఉపాధ్యాయులు కె.వెంకటేశ్వరరావు, బుచ్చిరెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పి.సుశీల ఉన్నారు.

గ్రామీణ వైద్యులపై దాడులు ఆపాలి


సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పీఎంపీ, ఆర్ఎంపీ సంక్షేమ సంఘం నాయకులు

నల్లగొండ టౌన్, జూన్ 13: తెలంగాణ మెడికల్ కౌన్సిల్, ఐఎంఏ, హెచ్‌ఆర్డీ పేరుతో గ్రామీణ వైద్యుల క్లినిక్లపై కొందరు డాక్టర్లు చేస్తున్న దాడులను వెంటనే నిలిపివేయించాలని పీఎంపీ, ఆర్ఎంపీ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. పీఎంపీ, ఆర్ఎంపీ సంక్షేమ సంఘం నాయకులు హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నేతి రాజేశ్వర్‌రావు, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పొనుగోటి హనుమంతరావు మాట్లాడుతూ గ్రామీణ వైద్యుల క్లినిక్‌లపై పోలీసులతో కలిసి వచ్చి దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని సీఎంకు వివరించారు. తాము గతంలో ప్రభుత్వం నుంచి శిక్షణ తీసుకుని సర్టిఫికెట్లు కూడా పొందామని తెలిపారు. ఇప్పుడు కూడా తమకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేయాలని సీఎంను కోరారు. తగిన న్యాయం చేస్తానని, దాడులు నిలిపివేయిస్తామని సీఎం హామీ ఇచ్చారని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో సుశృత గ్రామీణ వ్యవస్థాపకుడు డి. సత్యనారాయణచారి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరాజు, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు అంబటి చెన్న కృష్ణయ్య, కార్యదర్శి కందగట్ల లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు.

శాలిగౌరారం: మారుమూల గ్రామాల్లో వైద్య సేవలు అందిస్తున్న గ్రామీణ వైద్యులపై అధికారుల దాడులు వెంటనే ఆపాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించడంపై శాలిగౌరారం మండల ఆర్ఎంపీ సీనియర్ వైద్యులు వీపూరి పరాంకుశం, దునక వెంకన్న, బండారు ధనుంజయ, మాదు వెంకన్న, శీలం శంకర్, దామెర్ల శ్రీనివాస్, అశోక్, దొనకొండ అంజయ్య హర్షం వ్యక్తం చేశారు.

సకాలంలో పూర్తిచేసేవారికి పనులు అప్పగించాలి


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, జూన్ 13: దేవరకొండ నియోజకవర్గంలో కొంతమంది కాంట్రాక్టర్లు టెండర్లువేసి సగం పనులు చేసి వదిలేస్తున్నారని, సకాలంలో ఒప్పందం మేరకు పనులు పూర్తిచేసేవారికే కాంట్రాక్ట్ పనులు అప్పగించాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అధికారులను కోరారు. గురువారం దేవరకొండలో ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌అండ్‌బీ అధికారులు, ప్రజా ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో చాలా వరకు పనులు పెండింగ్‌లో ఉన్నాయని, కొంత మంది కాంట్రాక్టర్లు టెండర్లు వేసి సీసీరోడ్లు వేశారని మిగతా బీటీ రోడ్ల పనులు వదిలేశారని అన్నారు. టెండర్లువేసి పనులు చేయకుండానే వదిలేసేవారిని బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆయన అధికారులను కోరారు. అసంపూర్తిగా పనులు చేసి వదిలేయడం, జాప్యం చేయడం సరైన విధానంకాదన్నారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు రోడ్లు, మౌళిక సదుపాయాలు కల్పించేందుకు నిధులు మంజూరవుతున్నట్లు తెలిపారు. ఆర్‌అండ్‌బీ రోడ్ల పనుల వివరాలను, పురోగతిని ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఈఈ ఖాజన్‌గౌడ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, డీఈ నగేష్, దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీపీలు జాన్‌యాదవ్, బిక్కునాయక్, కొండ్ర శ్రీశైలం, శిరందాసు కృష్ణయ్య, ఏర్పుల గోవిందు, జడ్పీటీసీ మారేపాకల అరుణ సురేష్‌గౌడ్, ఆయాశాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పిచ్చికుక్కల దాడిలో గాయాలు

దామరచర్ల, జూన్ 13: పిచ్చికుక్కలు స్వైర విహారం చేసి ఎనిమిది మందిని గాయపరిచాయి. ఈ సంఘటన మండల కేంద్రంలోని ఎరనాం కాలనీలో బుధవారం రాత్రి జరిగింది. కాలనీకి చెందిన ఎలీశమ్మ, సంజన, రేణుక, పిచ్చమ్మ, అమర్, రాకేష్, నాగరాజు, జశ్వంత్‌లు వారి ఇళ్ల వద్ద నిల్చోని ఉండగా రెండు పిచ్చికుక్కలు వారిపై దాడి చేసి గాయపరిచాయి. దీంతో బాధితులు చికిత్స కోసం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లారు. అక్కడ సమయానికి వైద్యాధికారులు లేకపోవడంతో అధికారులకు సమాచారం అందించారు. కొంత సమయం తర్వాత అక్కడికి చేరుకున్న వైద్యా ధికారి వారికి చికిత్స అందించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ గతంలో పిచ్చికుక్కల దాడిలో పలువురు గాయపడ్డారని, అధికారులకు ఈ విషయాన్ని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

'ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి'

దేవరకొండ, జూన్ 13: డిండి మండలం ఎర్రగుంటపల్లి మాజీ సర్పంచ్ భర్త వెంకటయ్యను అసభ్య పదజాలంతో దూషించిన డిండి ఎస్ఐ రాజుపై చర్య తీసుకోవాలని ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. డిండి ఇన్‌చార్జి సీఐ నర్సింహులుకు గురువారం దేవరకొండ పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. ఎర్రగుంటపల్లి మాజీ సర్పంచ్ భర్త వెంకటయ్య భూమి విషయమై ఫిర్యాదు చేయడానికి వెళితే అసభ్యపదజాలంతో దూషించారని, విచారణ చేసి ఎస్ఐపై శాఖపరమైన చర్య తీసుకొని బాధితునికి న్యాయం చేయాలని వారు కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకూరి నర్సింహ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదిగొండ ఎల్లేష్‌మాదిగ, ఎర్ర కృష్ణజాంబవ్, పొట్ట మురళి, యాదగిరి, నర్సింహ, బిక్షపతి తదితరులు ఉన్నారు.

16న వైద్య శిబిరం

నల్లగొండ రూరల్, జూన్ 13: నర్రా రాఘవరెడ్డి స్మారక ప్రజా వైద్యశాల, ఎంవీఎన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన ఉదయం 11 గంటలకు ఎంవీఎన్ విజ్ఞాన కేంద్రంలో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్టు కార్యనిర్వాహక కార్యదర్శి పి. నర్సిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంప్‌లో షుగర్, బీపీ, ఫిట్స్ రోగులకు వైద్యం నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చేవారు రెండు, మూడు ముందుగా టెస్టులు చేసుకొని వాటితో పాటు ప్రస్తుతం వాడుతున్న మందుల స్లిప్పులు వెంట తీసుకురావాలని పేర్కొన్నారు.

15న దేవాలయ భూమి కౌలుకు వేలం

నల్లగొండ కల్చరల్, జూన్ 13: అనుముల మండలంలోని మారేపల్లి గ్రామంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయానికి సంబంధించిన ప్లాట్ నెంబర్ 1నుంచి 70 వరకు గల 189 ఎకరాల 33 గుంటల వ్యవసాయ భూమి ఒక సంవత్సరానికి కౌలుకు ఇచ్చేందుకు ఈ నెల 15వ తేదీన కనగల్లు రైతు వేదిక భవనంలో కౌలు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు దేవాలదాయశాఖ ఏసీ మహేంద్రకుమార్, ఆలయ అధికారి అంబటి నాగిరెడ్డిలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.10వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని తెలిపారు.

ఏపీఎంగా చంద్రశేఖర్

మాడ్గులపల్లి, జూన్ 13: మండల ఏపీఎంగా చంద్రశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన దేవరకొండ క్లస్టర్ నుంచి బదిలీపై వచ్చారు. చంద్రశేకర్‌ను కార్యాలయ సిబ్బంది సన్మానించారు.


ఎమ్మెల్యే సామేల్‌పై ఆరోపణలు తగవు

శాలిగౌరారం, జూన్ 13: తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌పై అసత్య ప్రచారం మానుకోవాలని ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పెరుమాండ్ల నరేష్ అన్నారు. శాలిగౌరారంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ప్రాజెక్టులకు నిబంధనల ప్రకారం ఇసుక తరలిస్తుంటే సోషల్ మీడియాలో రాద్ధాంతం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యేపై గ్లోబల్స్ ప్రచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. గత పాలకులు ఇసుకను వ్యాపారంగా మార్చుకుని వందల కోట్లు సంపాదించారన్నారు.

మాజీ ఎంపీ బడుగుల లింగయ్య జన్మదిన వేడుకలు

కేతేపల్లి, జూన్ 13: మండలంలోని వివిధ గ్రామాల్లో రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ జన్మదిన వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. సూర్యాపేటలోని లింగయ్యయాదవ్ ఇంటికి వెళ్లి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ శ్రీనివాసయాదవ్, నాయకులు మారం వెంకటరెడ్డి, చిమట వెంకన్న, నాగరాజు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు మంత్రి ఆర్థిక సాయం



కనగల్, జూన్13: కనగల్ గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు నర్సింగ్ పెదఇద్దులు బుధవారం రాత్రి మృతిచెందారు. కాంగ్రెస్ కార్యకర్త వెలుగు నాగార్జున అనారోగ్యంతో గురువారం ఉదయం మృతిచెందారు. వీరి కుటుంబాలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సానుభూతి తెలిపారు. నాగార్జునకు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. అతను నిరుపేద కావడంతో మంత్రి పంపిన రూ.లక్షను మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్ ఆ కుటుంబానికి అందజేశారు. అదేవిదంగా పెద ఇద్దులు మృతదేహాన్ని శ్రీనివాస్‌గౌడ్ సందర్శించి నివాళులర్పించారు. ఆ కుటుంబానికి మంత్రి పంపిన రూ.25వేలను ఆయన అందజేశారు. నాగార్జున కుటుంబానికి నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి రూ.10వేలు అందజేశారు. పెద ఇద్దులు మృతదేహానికి సీపీఎం నాయకులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సయ్యద్ హాషం, పాలడుగు నాగార్జున, ప్రభావతి, సలీం, కానుగు లింగస్వామి, అక్రమ్, సుల్తాన తదితరులు నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో జడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్, నాయ కులు నర్సింగ్ క్రిష్ణయ్యగౌడ్, హఫీజుద్దీన్, సింగం పెద్దులు, రాయల శ్రవణ్, సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రగ్బీలో జిల్లా జట్లకు బంగారు పతకాలు


బంగారు పతకాలు సాధించిన రగ్బీ క్రీడాకారులు

నల్లగొండ కల్చరల్, జూన్ 13: సికింద్రాబాద్ జింఖానా మైదానంలో ఈ నెల 11నుంచి 13వ తేదీ వరకు జరిగిన 5వ తెలంగాణ రాష్ట్రస్థాయి రగ్బీ జూనియర్ ఛాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా బాల, బాలిక జట్లు ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించాయి. క్రీడాకారులను అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గడ్డంపల్లి రవీందర్‌రెడ్డి, దాసరి పృథ్వీరాజ్ యాదవ్ గురువారం అభినందించారు. ఈ కార్యక్రమంలో కోచ్ రాజేష్, దేవదాస్, మౌనిక, అరుణ, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమంలో వేణు సంకోజు పాత్ర కీలకం

నల్లగొండ కల్చరల్, 13: జిల్లా సాహిత్యానికి, తెలంగాణ ఉద్యమంలో కవి వేణు సంకోజు కీలక పాత్ర వహించారని ఎన్జీ కళాశాల తెలుగుశాఖ అధ్యక్షుడు డాక్టర్ తండు కృష్ణకౌండిన్య అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని సృజన సాహితీ సంస్థ ఆధ్వర్యంలో దాశరథి పురస్కార గ్రహీత వేణు సంకోజు సన్మాన సభలో మాట్లాడారు. సాహిత్యంలో కొత్త తరాన్ని ప్రోత్సహించడంలో వేణు సంకోజు ముందుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీ వేత్తలు పెరమాళ్ల ఆనంద్, సాగర్ల సత్తయ్య, రఘువీర్, శ్రీనివాస్, లింగమూర్తి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

గురుకుల బాలికల డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు


పీఏపల్లి ఆదర్శ పాఠశాల, కళాశాలలో ప్రచారం నిర్వహిస్తున్న సిబ్బంది

పెద్దఅడిశర్లపల్లి, జూన్ 13: దేవరకొండ హెచ్‌ఆర్‌డీ భవనంలో తెలంగాణ గురుకుల బాలికల డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరేందుకు స్పాట్ అడ్మిషన్లు కొనసాగుతున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. శ్యామల తెలిపారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కళాశాల ఉపాధ్యాయులతో కలిసి గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ నెల 17వ తేదీ నుంచి స్పాట్ అడ్మిషన్లు ప్రారంభమవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ రంగీలా, ఎస్‌కే అయేషా తదితరులు పాల్గొన్నారు.

కళాకారుడు నాగేందర్ మృతి



వేములపల్లి, జూన్ 13: మండలంలోని మొల్కపట్నం గ్రామానికి ప్రజానాట్య కళామండలి రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు జెర్రిపోతుల నాగేందర్(52) అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. ఆయన వివిధ పత్రికల్లో విలేకరిగా పని చేశారు. కళాకారులు, జర్నలిస్టులు, పలు పార్టీల నాయకులు నాగేందర్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాగేందర్‌కు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. నాగేందర్ అంతిమయాత్రలో కళాకారులు పాటలతో నివాళులర్పించారు.

రిటైర్డ్ ఉద్యోగులకు నేడు ఉచిత కంటిపరీక్షలు

నల్లగొండ టౌన్, జూన్ 13: తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్(టాప్రా) సౌజన్యంతో హైదరాబాద్‌లోని మ్యాక్స్ విజన్ శ్రీ మహాలక్ష్మి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు స్థానిక యూటీఎఫ్ భవన్‌లో రిటైర్డు ఉద్యోగులకు హెల్త్‌కార్డుపై ఉచిత కంటి పరీక్షలు, ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు టాప్రా జిల్లా అధ్యక్ష ప్రధన కార్యదర్శులు నూకల జగదీష్‌చంద్ర, పందిరి శ్యాంసుందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

శాలిగౌరారం, జూన్ 13: మండలంలోని వల్లాల మోడల్ స్కూల్‌లో అవర్లీ బేసిక్ టీచర్ పోస్టు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి. రాగిణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తరగతి నుంచి సీనియర్ ఇంటర్ వరకు ఎకనామిక్స్ బోధించే వారు ఏంఏ ఎకనామిక్స్‌తో బీఈడీ చేసి 3 నుంచి ఐదు సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ నెల 18వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ నెల 20న డెమోక్లాస్ నిర్వహిస్తామన్నారు. అర్హులైన అభ్యర్థులు సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాగిణి తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు పరామర్శ



మాడ్గులపల్లి, జూన్ 13: మండలంలోని సీత్యాతండా గ్రామ మాజీ సర్పంచ్ వాంకుడోతు సుధాకర్ అస్వస్థతకు గురై మిర్యాలగూడ పట్టణంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నిమ్మల నవీన్‌రెడ్డి ఉన్నారు.